సాక్షి అనకాపల్లి

మంగళవారం । 29 । జూలై । 2025



టీడీఆర్ బాండ్లు వద్దే వద్దు

నగదు రూపంలోనే పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు నిర్వాసితులు ధర్నా చేశారు. 8లో



అప్పన్నకు నిత్యకల్యాణం

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం కన్నుల పండువగా జరిగింది.



'సినారె' రచనలు సందేశాత్మకం

సీతంపేట: విశాఖలో జరిగిన సినారె సాహిత్య సమాలోచనలో వక్తలు నారాయణరెడ్డి రచనలు సందేశాత్మకమని కొనియాడారు.

న్యూస్‌రీల్

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మెరిసిన నాగజ్యోతి



రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తలపడుతున్న ఉపాధ్యాయిని నాగజ్యోతి

రోలుగుంట: రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయిని పీవీఎం నాగజ్యోతి గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం రేవేంద్రపాడులో ఈ నెల 26, 27 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. అమరావతి పవర్ లిఫ్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో ఆమె వివిధ విభాగాల్లో మూడు బంగారు పతకాలు సాధించారు. సబ్ జూనియర్, జూనియర్ విభాగాలుగా నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో తలపడ్డారు. 74 కిలోల మాస్టర్స్ విభాగంలో స్క్వాట్, బెంచ్ ప్రెస్, డెడ్‌లిఫ్ట్ విభాగాల్లో విజేతగా నిలిచిన నాగజ్యోతికి ఏఎంసీ డైరెక్టర్ దుగ్గిరాల, ఎంపీటీసీ మధుబాబు మూడు బంగారు పతకాలు ప్రదానం చేశారు.

ప్రభుత్వ కాలేజీల్లో 3286 అడ్మిషన్లు

యలమంచిలి రూరల్: జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, హైస్కూల్ ప్లస్‌లలో ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఇప్పటివరకు 3286 మొదటి సంవత్సరం అడ్మిషన్లు జరిగాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి ఎం.వినోద్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా ప్రవేశాలు జరగడానికి సమయం ఉందని ఆయన పేర్కొన్నారు.

కిరండూల్ రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం (విశాఖ): కోరాపుట్-మల్లిగుడ-జరాటి స్టేషన్ పరిధిలో జరగుతున్న భద్రతా పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే రైళ్ల గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖలో మంగళవారం రాత్రి బయల్దేరే విశాఖపట్నం-కిరండూల్ (18515) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో మంగళ, బుధవారాల్లో కిరండూల్-విశాఖపట్నం(18516) నైట్ ఎక్స్‌ప్రెస్ కిరండూల్ నుంచి కాకుండా కోరాపుట్ నుంచి బయల్దేరుతుంది. విశాఖలో మంగళ, బుధవారాల్లో బయల్దేరే విశాఖపట్నం-కిరండూల్ (58501) పాసింజర్ కోరాపుట్ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో మంగళ, బుధవారాల్లో కిరండూల్-విశాఖపట్నం (58502) పాసింజర్ కిరండూల్ నుంచి కాకుండా కోరాపుట్ నుంచి బయల్దేరుతుంది.

బ్రిటిష్ సమాధుల స్థలాన్ని పరిరక్షించండి

- ఆక్రమణలపై స్పీకర్ నోరు విప్పాలి
- సీపీఎం నాయకుల డిమాండ్



అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, నాయకులు

నర్సీపట్నం: బ్రిటిష్ సైనికాధికారుల సమాధుల స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధికారులను డిమాండ్ చేశారు. సీపీఎం బృందం ఈ స్థలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను సోమవారం పరిశీలించింది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఇలాంటి పరిణామం జరగడం బాధాకరమన్నారు. స్పీకర్ నోరు విప్పకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. అల్లూరి స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తికి చిహ్నంగా ఉన్న బ్రిటిష్ సైనికాధికారుల సమాధుల స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బ్రిటిష్ సమాధుల స్థలాన్ని ఆక్రమించేసి, నిర్మాణాలు చేపడుతుంటే కాపాడాల్సిన రెవెన్యూ, మున్సిపల్, పురావస్తుశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. కోర్టులో కేసు నడుస్తున్నప్పటికీ ఆక్రమణకు పాల్పడుతున్న వారిపై రెవెన్యూ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ నిర్మాణాలకు రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ అనుమతులు ఉన్నాయా..? ఉంటే అనుమతులు ఎవరు ఇచ్చారో స్పష్టం చేయాలన్నారు. దోషులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆక్రమణలను పరిశీలించిన వారిలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, సీనియర్ నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, ఈరెల్లి చిరంజీవి తదితరులు ఉన్నారు.

వెల్‌నెస్ కేంద్రం బిల్లు నిలిపివేశారు..



బిల్లు చెల్లించాలని అడిగిన కాంట్రాక్టర్‌ను బయటకు తీసుకొస్తున్న పోలీసులు

గత ప్రభుత్వం మంజూరు చేసిన వెల్‌నెస్ కేంద్రం నిర్మాణం పూర్తి చేసి ఏడాది పూర్తయిందని, ఎన్నికల అనంతరం మంజూరైన పెండింగ్ బిల్లు రూ.7,50,314లు చెల్లించకుండా టీడీపీ నేత గండి బాబ్జీ నిలిపేశారని సబ్బవరం మండలం మొగలిపురం గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ యడ్ల నాయుడు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఏడాది కాలంగా కలెక్టర్, జేసీ, జిల్లా పంచాయతీ అధికారి, ఇంజినీరింగ్ అధికారులకు అనేక వినతులు ఇచ్చినా పట్టించుకోవడం లేదంటూ నిరసనకు సిద్ధమవ్వగా సిబ్బంది బయటకు ఈడ్చుకెళ్లారని, తనకు బిల్లు వెంటనే చెల్లించాలంటూ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. సర్పంచ్ పదవికి గండి బాబ్జీ భార్యపై పోటీ చేయడంతో కక్ష కట్టి కావాలనే బిల్లు నిలిపివేశారని, సర్పంచ్‌పై, గండి బాబ్జీపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అసహనం.. ఆవేదన

అర్జీదారుల కష్టాలకు కరగని కలెక్టరేట్

పీజీఆర్‌ఎస్‌లో కనిపించిన దయనీయ దృశ్యాలెన్నో..

తుమ్మపాల: ఎనిమిది నెలలుగా ప్రతి వారం కలెక్టరేట్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తున్నా తన బిల్లు చెల్లింపునకు కనీస చర్యలు తీసుకోలేదంటూ సబ్బవరం మండలం మొగలిపురం గ్రామానికి చెందిన యడ్ల నాయుడు సోమవారం కలెక్టర్ విజయ కృష్ణన్ ఎదుట నిరసన తెలిపారు. భూసమస్య పరిష్కరించాలంటూ ఇప్పటికి 50 సార్లు పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేదని నక్కపల్లికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు, రైల్వే బోర్డు మెంబర్ కొలనాటి అప్పారావు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. తన పేరున ప్రభుత్వం ఇచ్చిన డీ పట్టా భూమి 4 ఎకరాలను ఇతరుల పేరున ఆన్‌లైన్ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ పదే పదే ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని నక్కపల్లి మండలం ఉపమాక గ్రామానికి చెందిన కురందాసు నాగరాజు నిరాశ వ్యక్తం చేశారు. సాంకేతిక కారణాలు చూపి రూ.15 వేల పింఛన్ మంజూరు చేయకుండా తిప్పిస్తున్నారని 90 శాతం వికలాంగుడైన కుమారుడితో వచ్చిన పొట్ల అప్పారావు దంపతులు వాపోయారు.

అవే అర్జీలు.. పరిష్కారం శూన్యం 8లో

కలెక్టర్ కరుణించాలి..



దివ్యాంగుడైన తులసీరామ్‌ను ఒడిలో పెట్టుకుని కలెక్టరేట్ వద్ద నిరీక్షిస్తున్న తల్లి

పుట్టుకతోనే 90 శాతం వైకల్యం కలిగి అనేక ఇబ్బందులతో పోషించుకుంటున్న బిడ్డకు రూ.15 వేల ప్రభుత్వ పించన్ మంజూరు చేయాలని ఏడాది కాలంగా తిరుగుతున్నా అధికారులు జాలి చూపడం లేదని మునగపాక మండలం నాగులాపల్లికి చెందిన బాలుడు పొట్ల తులసీరావు తల్లిదండ్రులు అప్పారావు దంపతులు ఆవేదన చెందారు. వ్యయప్రయాసలతో ఇంటి నుంచి బిడ్డను మోసుకొస్తున్నా కనికరించడం లేదన్నారు. ఏడాది కాలంలో మూడుసార్లు కలెక్టరేట్‌కు వచ్చామని, కలెక్టర్ వద్దకు నేరుగా వెళ్లనివ్వకుండా కింద నుంచే పంపించేస్తున్నారని వాపోయారు. కలెక్టర్‌కు బిడ్డ తండ్రి అప్పారావు అర్జీ అందించారు. మానసిక వైకల్యం ఉన్నట్టు సర్టిఫికెట్‌లో ఉన్నందున 15 వేల పింఛన్ రాదని చెబుతున్నారని, తమ బిడ్డ దయనీయ స్థితిని చూసైనా కలెక్టర్ కరుణించాలని వారు వేడుకుంటున్నారు.

మృతి చెందిన ఖైదీ కుటుంబానికి ఆర్థిక సహాయం



రూ.5 లక్షల చెక్కును అందిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: విశాఖపట్నం కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తూ 2023 సెప్టెంబర్ 12న మరణించిన రావికమతం మండలం గుమ్మలపాడు గ్రామానికి చెందిన మామిడి అర్జున కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వ సహాయ నిధి నుంచి రూ.5 లక్షలు మంజూరయ్యాయి. సోమవారం కలెక్టర్ విజయ కృష్ణన్ మృతుని భార్య రమణమ్మ, కుమార్తె మౌనికదేవిలకు చెక్కును అందించారు. తమది నిరుపేద కుటుంబమని, ఆర్థిక భరోసా కల్పించాలని జాతీయ మానవహక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)కు అర్జీ సమర్పించడంతో ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ మెజిస్టీరియల్ విభాగ పర్యవేక్షకుడు ఎస్.వి.ఎస్.వాసునాయుడు పాల్గొన్నారు.

అన్నదాతల ధర్మాగ్రహం

- తీసుకున్న భూములకు ప్యాకేజీ ఇవ్వలేదు
- కొత్తగా భూసేకరణకు నోటిఫికేషన్ జారీ
- మాట తప్పిన చంద్రబాబు సర్కారు
- వంట, వార్పుతో నిరసన తెలిపిన నిర్వాసితులు, రైతులు
- నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం ముట్టడి



నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద వంట వార్పు చేస్తున్న రైతులు



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

నక్కపల్లి: తీసుకున్న భూములకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించకుండా, అదనంగా వేలాది ఎకరాల భూములు సేకరించేందుకు పూనుకున్న కూటమి ప్రభుత్వ వైఖరిపై తాడోపేడో తేల్చుకునేందుకు అన్నదాతలు సిద్ధమయ్యారు. గతంలో ఇచ్చిన మాట తప్పి ప్యాకేజీ ఎగ్గొట్టే ప్రయత్నాలు చేస్తున్న చంద్రబాబు సర్కారు వైఖరిని నిరసిస్తూ ఆందోళన బాట పట్టారు. సోమవారం చందనాడ, అమలాపురం, పాటిమీద, మూలపర, తమ్మయ్యపేట, బోయపాడు తదితర గ్రామాలకు చెందిన రైతులంతా భారీగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల నుంచి మండల కేంద్రం నక్కపల్లి చేరుకుని తహసీల్దార్ కార్యాలయం ముందు వంటా వార్పు నిర్వహించారు. అక్కడే భోజనాలు చేసి సాయంత్రం వరకు ఆందోళన నిర్వహించారు. కార్యాలయాన్ని ముట్టడించి కూటమి ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లిస్తామని నమ్మబలికి 2014లో భూసేకరణ చేశారన్నారు. అప్పట్లో చంద్రబాబు, స్థానిక ఎమ్మెల్యే వంగలపూడి అనితలను నమ్మి రైతులంతా స్వచ్ఛందంగా భూములు ఇచ్చారన్నారు. కేవలం పరిహారం మాత్రమే చెల్లించి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించకుండా తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆందోళనకు నాయకత్వం వహించిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు ఎం.అప్పలరాజు, సర్పంచ్ తళ్ల భార్గవ్, ఎంపిటీసీ సభ్యుడు గంటా తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్ విభాగం అధ్యక్షుడు సూరాకాసుల గోవిందు ఆరోపించారు. ఇప్పుడు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద రూ.8.90 లక్షలు చెల్లిస్తామని చెబుతున్నారన్నారని, ఇది ఏ మూలకు సరిపోదన్నారు. భూములు స్వాధీనం చేసుకున్న సమయానికి నిర్వాసిత కుటుంబాల్లో మేజర్లుగా ఉన్న ఆడ, మగవారికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద రూ.25 లక్షలు చెల్లించాలని, గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని మాత్రమే తాము డిమాండ్ చేస్తున్నామన్నారు.

కూటమి పెద్దల కోసమే అదనపు భూసేకరణ

ఇప్పటికే మండలంలో 4500 ఎకరాలు సేకరించి స్వాధీనం చేసుకున్న ప్రభుత్వం.. అదనంగా కాగిత, నెల్లిపూడి, వేంపాడు డీఎల్ పురాల్లో 2500 ఎకరాలు, సిహెచ్‌ఎల్ పురం, జానకయ్యపేట, పెదతీనార్ల, గుర్రాజుపేటలలో 790 ఎకరాలు అదనంగా తీసుకునేందుకు నిర్ణయించిందన్నారు. రైతుల ఆమోదం లేకుండా పత్రికల్లో 6 ఏ ప్రకటన విడుదల చేసిందన్నారు. కూటమిలో భాగస్వాములుగా ఉన్న రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టేందుకు అదనంగా భూములు సేకరిస్తున్నారని ఆరోపించారు. పేదల భూములతో ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని మండిపడ్డారు. కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం అనంతరం తహసీల్దార్ నర్సింహమూర్తికి వినతి పత్రం అందజేశారు. ఆందోళనలో డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు అయినంపూడి మణిరాజు, రైతులు తళ్ల అప్పలస్వామి, తాతారావు, వంకా కృష్ణ, శంకరశెట్టి చిన్నా, రామలక్ష్మి, చిన్నమ్మలు, చంటమ్మ, మనబాల రాజేష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

గత్యంతరం లేక రోడ్డెక్కాం



కంపెనీల కోసం భూములు, ఇళ్లు త్యాగం చేశాం. ఊరు ఖాళీ చేసి వేరొక చోటకు వెళ్లి బతకడం అంటే గుండె చెరువైపోతోంది. సర్వం కోల్పోయిన మాకు ప్రభుత్వం అరకొరగా పరిహారం ఇవ్వడం ఎంతవరకు సమంజసం. ప్యాకేజీ కింద రూ.25 లక్షలు చెల్లించమని ఏడాది నుంచి కోరుతున్నా పట్టించుకోవడం లేదు. గత్యంతరం లేక రోడ్డెక్కాల్సిన దుస్థితి ఏర్పడింది.

–సూరాకాసుల రామలక్ష్మి, మూలపర

ఊరు వదిలి పొమ్మంటున్నారు



అప్పట్లో భూములు తీసుకునేటప్పుడు ఒకలా, ఇప్పుడు మరోలా మాట్లాడుతున్నారు. పిల్లలు చిన్నవయసులో ఉన్నప్పుడు భూములు ఇచ్చేశాం. పదేళ్లయింది. ఎన్నో మార్పులు జరిగాయి. ధరలు పెరిగాయి. ఇవే భూములను నమ్ముకుని జీవించాలి. పిల్లలకు పెళ్లిళ్లు చేయాలి. ఇప్పుడు డబ్బులు తక్కువ ఇత్తామంటున్నారు. ఊరు ఖాళీ చేసి ఇంకో దగ్గరకు పొమ్మంటున్నారు.

–పెంటకోట చిన్నమ్మలు, అమలాపురం

డ్రోన్ల సాయం.. లాభసాటి సేద్యం

- తగ్గనున్న పెట్టుబడి ఖర్చు.. నీటి ఎద్దడిని తట్టుకోనున్న పైరు
- డ్రోన్ సహాయంతో వరి విత్తనాలు చల్లే పద్ధతికి శ్రీకారం
- ఆర్‌ఏఆర్‌ఎస్‌లో పరీక్షించిన శాస్త్రవేత్తలు
- చీడపీడల బాధ తగ్గుతుందని ఆశాభావం



డ్రోన్ టెక్నాలజీతో డ్రై డైరెక్ట్ విధానంతో వరి విత్తనాలు నాటే విధానాన్ని పర్యవేక్షిస్తున్న ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు

సాక్షి, అనకాపల్లి:

వ్యవసాయం లాభసాటి కావాలంటే రైతులు యాంత్రీకరణ బాట పట్టాల్సిందే. ఇప్పటికే సాగులో దుక్కు, మందుల పిచికారీ వంటి పనులు యంత్రాల సాయంతో చేపడుతున్నారు. అలాగే డ్రోన్లతో వరి సహా అనేక పంటలపై పురుగు మందులు, ఎరువులు చల్లటం వంటి పనులు కూడా చేస్తున్నారు. తాజాగా వరి సాగులో నారుకు బదులు నేరుగా డ్రోన్ సాయంతో విత్తనాలు వెద చల్లే పద్ధతికి సోమవారం అనకాపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్ పరిశోధన స్థానంలో శ్రీకారం చుట్టారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న మారుతి డ్రోన్ సంస్థ సాంకేతిక సహకారంతో శాస్త్రవేత్తలు డాక్టర్ రమణమూర్తి, డాక్టర్ గౌరీ, డాక్టర్ జగన్నాథరావు ఈ విధానాన్ని పరీక్షించారు. ఈ విధానంలో పెట్టుబడి ఖర్చు తగ్గడంతోపాటు పైరు నీటి ఎద్దడిని తట్టుకుంటుంది.

73 శాతం విత్తనం ఆదా

ఆర్‌ఏఆర్‌ఎస్‌లో 21 సెంట్ల పొడి నేలలో నాలుగు నిమిషాల్లో, 15 సెంట్ల తడి నెలలో 3.2 నిమిషాల్లో డ్రోన్ ద్వారా వరి విత్తనాలు వేశారు. సగటున 3.5 మీ/సె వేగంతో డ్రోన్ టెక్నాలజీతో విత్తనాలను నాటారు. ఈ పద్ధతిలో సగటున ఎకరాకు సుమారు 9 కేజీల వరి విత్తనాలు సరిపోతున్నాయి. ఇలా విత్తనాలను విత్తడానికి డ్రోన్‌కు ఒక ఎకరాకు 15 నిమిషాలు పడుతుంది. అయితే 21 సెంట్ల పొడి నేలలో 1.9 కేజీల విత్తనాలు చల్లడానికి మూడు నిమిషాలు పట్టింది. ఇదే సంప్రదాయ సాగు పద్ధతిలో ఎకరాలకు 30 నుంచి 35 కేజీల వరి విత్తనాలు అవసరం ఉంటుంది. డ్రోన్ ద్వారా విత్తే పద్ధతిలో 73 శాతం వరకు వరి విత్తనాలు ఆదా అవుతున్నాయి.

ఈ పద్ధతిలో పాటించాల్సిన జాగ్రత్తలు

- విత్తిన వెంటనే తడిపేందుకు తేలికపాటి నీటి డ్రిప్ ఉండాలి
- వరి నాటిన తర్వాత 7-10 రోజుల్లో మొలకల పరిస్థితిని పరిశీలించాలి
- పొలాన్ని సమతలంగా చేయడం చాలా ముఖ్యం
- విత్తనాలను వేసుకునే ముందే కలుపు మొక్కలను పూర్తిగా తొలగించాలి

తక్కువ పెట్టుబడి.. అధిక దిగుబడి



డ్రోన్ డ్రై డైరెక్ట్ సీడింగ్ అనేది వరి సాగులో ఓ వినూత్న పద్ధతి. ఇది సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వ్యవసాయాన్ని సమర్థవంతంగా, లాభదాయకంగా మార్చడానికి మేలైన మార్గం. ప్రధానంగా నీటి కొరత ఉన్న మెరక ప్రాంతాల్లో మాత్రమే ఈ విధానాన్ని రైతు అనుసరించాలి. ఆర్‌ఏఆర్‌ఎస్‌లో డ్రోన్ డ్రై డైరెక్ట్ సీడింగ్ విధానానికి శ్రీకారం చుట్టాం. విజయవంతమైతే ఉత్తరాంధ్రలో ఈ విధానాన్ని మరింత విస్తృతం చేస్తాం.

– డాక్టర్ జగన్నాథరావు, ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్త

కుట్టు శిక్షణ.. ప్రభుత్వ సొమ్ము భక్షణ

- కనీస సౌకర్యాల్లేని భవనాల్లో తూతూ మంత్రంగా శిక్షణ
- కొన్ని చోట్ల ఇరుకు గదులు, శిథిల భవనాల్లో ఏర్పాటు
- తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం లేక అవస్థలు
- ప్రభుత్వ నిధులతో ప్రైవేటు ఏజెన్సీల దోపిడీ పర్వం



దేవరాపల్లిలో శిథిల ఎంపీడీవో భవనంలో కొనసాగుతున్న కుట్టు శిక్షణ కేంద్రం



ఇరుకుగదిలో కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు

జిల్లాలో ప్రస్తుతం నడుస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాలు 19
ఇంకా ప్రారంభం కాని మండలాలు 6
శిక్షణ పొందుతున్న మహిళల సంఖ్య 2,167
ఒక్కో లబ్ధిదారుకు రూ.21 వేల చొప్పున కేటాయింపు



క్లాత్ కటింగ్ బల్ల లేక నేలపై కూర్చొని కట్ చేస్తున్న మహిళలు

దేవరాపల్లి: మహిళలకు స్వయం ఉపాధి కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలు ప్రైవేటు ఏజెన్సీ నిర్వాహకుల పాలిట వరంగా మారాయి. ఈ కేంద్రాల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఆ సంస్థలు మొక్కుబడిగా కొనసాగిస్తున్నాయి. అనకాపల్లి జిల్లాలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కర్డ్ (సెంటర్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్), సేఫ్ (సోషల్ ఏజెన్సీ ఫర్ పీపుల్స్ ఎంపవర్‌మెంట్) ప్రైవేట్ సంస్థలు మహిళలకు శిక్షణిస్తున్నాయి. మూడు నెలల పాటు శిక్షణతో పాటు లబ్ధిదారులకు సుమారు రూ.6 వేలు విలువ చేసే కుట్టు మిషన్ ఉచితంగా అందించాలి. ఇందుకు కోసం ప్రైవేటు సంస్థలకు ఒక్కో మహిళకు రూ.21 వేలు చొప్పున ప్రభుత్వం కేటాయిస్తుంది. ఈ నిధులతో విశాలమైన భవనంలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉండగా ఏజెన్సీ నిర్వాహకులు మాత్రం మండలాల్లో ఖాళీగా ఉన్న శిథిల ప్రభుత్వ భవనాల్లో కుట్టు శిక్షణ కేంద్రాలను నడిపిస్తూ ప్రభుత్వ సొమ్మును లూటీ చేస్తున్నారు. లబ్ధిదారుల సంఖ్యకు తగ్గట్టుగా కుట్టు మిషన్లు లేకపోవడంతో మిగిలిన వారంతా ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి. ఇరుకు గదుల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం కల్పించలేదు. క్లాత్ కటింగ్ కోసం టేబుల్ కూడా లేకపోవడంతో మహిళలు కటిక నేలపై కూర్చొని కట్ చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. దీన్ని బట్టి ఒక్కో లబ్ధిదారునికి ప్రభుత్వం కేటాయించిన మొత్తంలో సగం కూడా వెచ్చించడం లేదన్న సంగతి అర్థమవుతోంది.

జిల్లాలో 19 కుట్టు శిక్షణ కేంద్రాలు

అనకాపల్లి జిల్లాలో 19 చోట్ల కుట్టు శిక్షణ కేంద్రాలు నడుస్తున్నాయి. వీటిలో 14 కేంద్రాలు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాల్లోనే కొనసాగుతున్నాయి. నర్సీపట్నం నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, అనకాపల్లి అర్బన్, కె.కోటపాడు మండలాల్లో శిక్షణ కేంద్రాలు ప్రారంభం కాలేదు. జిల్లాలో ప్రస్తుతం 2,167 మంది ఉదయం, మధ్యాహ్నం రెండు బ్యాచ్‌లుగా ఆయా కేంద్రాల్లో మహిళలు శిక్షణ పొందుతున్నారు.

40 మందికి 24 మిషన్లు

దేవరాపల్లి మండలంలో శిథిలావస్థలో ఉన్న పాత ఎంపీడీవో భవనంలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఈ భవనం చిన్నపాటి వర్షానికే స్లాబ్ కారిపోతోంది. దీంతో మిషన్లు, సామగ్రి తడిసిపోతున్నాయి. కుట్టు శిక్షణకు హాజరయ్యే 40 మంది మహిళలకు ఒక్కటే మరుగుదొడ్డి ఉంది. కొన్ని ఫ్యాన్లు సైతం పని చేయకపోవడంతో ఉక్కపోతతో మహిళలు అవస్థలు పడుతున్నారు. బ్యాచ్‌కు 40 మంది చొప్పున హాజరవుతుండగా.. 24 మిషన్లు ఏర్పాటు చేశారు. మాడుగుల, చీడికాడ మండలాల్లోని సచివాలయ భవనాల్లో కుట్టు శిక్షణా కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు.

రవాణా చార్జీలు ఇవ్వాలి



కుట్టు శిక్షణ కోసం సుమారు 12 కిలోమీటర్ల మేర రోజూ రాకపోకలు సాగిస్తున్నాం. ఇందు కోసం రోజుకు రూ.150 వరకు రవాణా ఇతరాత్ర ఖర్చులు అవుతున్నాయి. ప్రభుత్వం స్పందించి దూర ప్రాంతాల నుంచి వచ్చే తమలాంటి వారికి రవాణా ఖర్చులు అందించాలి. ప్రస్తుతం శిక్షణిస్తున్న భవనం ఇరుకుగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నాం.

– తంగేటి సుగుణ, ఎస్.గజపతినగరం

వేధిస్తున్న మరుగుదొడ్డి సమస్య



కుట్టు శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్న భవనంలో మరుగుదొడ్డి సమస్య వేధిస్తోంది. ఉదయం, మధ్యాహ్నం సుమారు 30 మందికి పైబడి మహిళలు హాజరవుతుండగా ఒకే మరుగుదొడ్డి ఉంది. అధికారులు తమ సమస్యలపై దృష్టి సారించాలి.

– కోట్ని సాయికుమారి, ఎ.కొత్తపల్లి

దేవరాపల్లి కేంద్రం త్వరలో మార్పు

జిల్లాలో 19 కుట్టు శిక్షణ కేంద్రాల్లో 2,167 మంది మహిళలు శిక్షణ పొందుతున్నారు. వీటిలో 14 కేంద్రాలు ప్రభుత్వ భవనాల్లో నడుస్తున్నాయి. ఆరు కేంద్రాల్లో శిక్షణ కేంద్రాలు ప్రారంభించాల్సి ఉంది. దేవరాపల్లిలో కుట్టు శిక్షణ కేంద్రం సమస్య తమ దృష్టికి వచ్చింది. శిథిలమైన ప్రభుత్వ భవనంలో నుంచి మరో చోటకు మార్పు చేయాలని సంస్థ నిర్వాహకులకు సూచించాం. రెండు, మూడు రోజుల్లో వేరొక చోటుకు మార్పు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– జి.పెంటోజీరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, బీసీ కార్పొరేషన్, అనకాపల్లి జిల్లా

క్లుప్తంగా

భూ తగాదాలపై ఎస్పీ విభాగానికి అర్జీల వెల్లువ



అర్జీదారుల సమస్యలను వింటున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్‌కు 45 అర్జీలు వచ్చాయి. వీటిలో 35 వరకు భూ తగాదాలపై రావడం విశేషం. అర్జీదారుల నుంచి ఎస్పీ తుహిన్ సిన్హా అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను సావధానంగా తెలుసుకున్నారు. చట్టపరిధిలో ఉన్న సమస్యలను వారం రోజుల్లో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజలకు వేగంగా న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన బాధ్యత అన్నారు. ప్రజా సమస్యలపై శ్రద్ధ చూపిస్తూ, న్యాయపరంగా పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ వారం వచ్చిన అర్జీల్లో భూ తగాదాలు-35, కుటుంబ కలహాలు-5, మోసాలకు సంబంధించిన ఫిర్యాదు-1, ఇతర విభాగాలకు చెందినవి-4 అర్జీలు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావు, ఎస్ఐ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

'అంధుడినని మేనమామ మోసగించాడు'



మాట్లాడుతున్న వెంకటరమణమూర్తి

దాబాగార్డెన్స్ (విశాఖ): తన అంధత్వాన్ని అడ్డు పెట్టుకుని మేనమామ గంప సత్యనారాయణ మూర్తి తనను దారుణంగా మోసగించాడని నర్సీపట్నం మండలం చెట్టుపల్లి గ్రామానికి చెందిన బొల్లప్రగడ వెంకటరమణమూర్తి తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మీడియా సమావేశంలో బొల్లాప్రగడ అప్పన్న మోహనరావు, చంద్ర రాజ్యలక్ష్మితో కలిసి తన గోడు వెళ్లబోసుకున్నారు. చెట్టుపల్లి గ్రామంలో తన పేరిట ఉన్న ఎకరా 54 సెంట్ల భూమిని మోసగించి, ఆయన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని ఆరోపించారు. తనకు జరిగిన అన్యాయాన్ని గమనించి, కొందరు సన్నిహితులు విజయనగరం జిల్లా పాలకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ నెల 17న అన్ని ఆధారాలు సబ్‌రిజిస్ట్రార్‌కు అందజేసి భూమి రిజిస్ట్రేషన్ రద్దు చేయించినట్టు చెప్పారు. ఈ విషయమై అమరావతిలో సీఎం, డిప్యూటీ సీఎం కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం అందజేశానన్నారు. అంధుడనైన తనను ఎన్నో ఇబ్బందులకు గురి చేస్తున్నారని, సత్యనారాయణమూర్తిపై చర్యలు తీసుకుని, తనకు, తన కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం: పలు రైళ్లకు తాత్కాలికంగా అదనపు కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కే సందీప్ తెలిపారు. సంబల్‌పూర్-నాందేడ్ (20809) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఆగష్టు 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు, నాందేడ్-సంబల్‌పూర్ (20810) ఎక్స్‌ప్రెస్‌కు ఆగష్టు 2వ తేదీ నుంచి సెప్టెంబరు 1వ తేదీ వరకు 1-థర్డ్ ఏసీ, 1- స్లీపర్ క్లాస్ కోచ్‌లను జతచేస్తున్నారు.

అవే అర్జీలు.. పరిష్కారం శూన్యం

- సమస్యలు పరిష్కరించాలని పదే పదే ఫిర్యాదులు
- వాటిని పరిష్కరించకుండానే పొంతన లేని సమాధానం
- అధికారుల తీరుపై అర్జీదారుల అసహనం
- పీజీఆర్ఎస్‌కు ఆలస్యంగా వచ్చిన అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

తుమ్మపాల: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) కార్యక్రమంపై పలువురు అర్జీదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పేరుకే పీజీఆర్ఎస్ అని ఒక్క పనీ పూర్తయింది లేదని వాపోతున్నారు. సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి, డీఆర్వో వై.సత్యనారాయణ రావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఉదయం పది గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు ఆలస్యంగా రావడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్జీల పరిష్కారంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని ఆదేశించారు. పలువురు అర్జీదారులు అర్జీ నమోదు చేసుకోకుండానే కలెక్టర్‌ను కలవడంతో సిబ్బంది తీరును హెచ్చరించారు. ఈ వారం మొత్తం 297 అర్జీలు నమోదయ్యాయి. రెవెన్యూ విభాగం వినతులతోపాటు తల్లికి వందనంపై ఫిర్యాదులు అందాయి.

భూ సమస్యలపై ఎన్నిసార్లు ఫిర్యాదులు చేయాలని నిరసన

భూ సమస్య పరిష్కరించాలంటూ ఇప్పటికి 50 సార్లు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు చేశానని, ప్రతి వారం కలెక్టరేట్‌కు వచ్చి విన్నవిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, పొంతన లేని సమాధానాలతో చేతులు దులుపుకుంటున్నారని నక్కపల్లికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు, రైల్వే బోర్డు మెంబర్ కొలనాటి అప్పారావు అసహనం వ్యక్తం చేశారు. తన పేరున ప్రభుత్వం ఇచ్చిన నాలుగెకరాల డీ పట్టాను ఇతరుల పేరున ఆన్‌లైన్ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ పదే పదే ఫిర్యాదులు చేస్తున్నా చర్యలు లేవని నక్కపల్లి మండలం ఉపమాక గ్రామానికి చెందిన కురందాసు నాగరాజు నిరాశ వ్యక్తం చేశాడు. రూ.15 వేల పింఛన్ కోసం చిన్నపాటి తప్పులు సాకుగా చూపి కలెక్టరేట్ చుట్టూ తిప్పించుకుంటూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని 90 శాతం దివ్యాంగుడైన పొట్ల తులసిరామ్, అతని తండ్రి అప్పారావు వాపోయారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి



బీజేపీ సీనియర్ నాయకుడు అప్పారావు

కలెక్టరేట్‌లో పొమ్మంటే నా బాధ ఎవ్వరికీ చెప్పుకోవాలి



బయోమెట్రిక్‌లో వేలిముద్రలు పడటం లేదని ఆధార్ కార్డు ఇవ్వడం లేదు. కలెక్టరేట్‌కు వస్తే ఆధార్ కార్డు లేనిదే పీజీఆర్ఎస్‌లో అర్జీ నమోదు కుదరదంటూ సిబ్బంది పొమ్మంటున్నారు. నా బాధ ఇంకెవ్వరికీ చెప్పుకోవాలని పాయకరావుపేట మండలం పెదరామభద్రపురం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు పోలిన వెంకటలక్ష్మి తిరుగుముఖం పట్టింది. దివ్యాంగురాలైన ఆమెను కుటుంబ సభ్యులు వదిలేయడంతో ఒంటరిగా జీవిస్తోంది. గతంలో పింఛన్ వచ్చేదని, ఆధార్ కార్డు లేకపోవడంతో నిలిపివేసారని ఆమెతో వచ్చిన తోటి మహిళ తెలిపింది. ఆధార్ కార్డు మంజూరు చేస్తే ప్రభుత్వ పథకాలతో భరోసా దొరుకుతుందని ఆశతో వచ్చామని చెప్పింది.

అమ్మ చనిపోతే తల్లికి వందనం ఇవ్వరంట..



మా అమ్మ చనిపోవడంతో 9వ తరగతి చదువుతున్న నాకు, ఏడో తరగతి చదువుతున్న నా తమ్ముడికి తల్లికి వందనం నిలిపివేశారంటూ చోడవరం టౌన్‌లోని గాంధీనగరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి మామిడిపాక శ్రీసత్యసాయి ధనోష్ వాపోయాడు. అతడు తన తండ్రి శ్రీనివాస్‌తో కలిసి కలెక్టరేట్‌లో విన్నవించుకున్నాడు. రెండేళ్ల క్రితం తల్లి మహాలక్ష్మి మృతి చెందింది. ఇటీవల తల్లికి వందనం జాబితాలో మా పేర్లు రావడంతో తండ్రి బ్యాంక్ ఖాతాకు జత చేశామని, అయినా మాకు తల్లికి వందనం రాలేదని మొరపెట్టుకున్నాడు. అధికారులు పరిశీలించి తల్లికి వందనం నగదు మంజూరు చేయాలని కోరాడు.

అంగన్‌వాడీ నియామకాల్లో అవినీతి



అంగన్‌వాడీ నియామకాల్లో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ సోదరుల అవినీతిపై విచారణ చేసి తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం నాయకులు కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేటలో ఎస్సీ రిజర్వేషన్‌లో వచ్చిన అంగన్‌వాడీ పోస్టుకు మంత్రి సునీత అర్హురాలైనా ఎంపిక చేయలేదన్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఇంటర్వ్యూ ప్యానల్ అవినీతికి పాల్పడి ఆమెకు అన్యాయం చేసిందన్నారు. తక్షణమే విచారణ చేపట్టి అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యే, అధికారులపై చర్యలు తీసుకోవాలని విదసం నాయకులు డాక్టర్ బూసి వెంకటరావు, బాజి ఒంకార్, గుడివాడ ప్రసాద్, బూల భాస్కరరావు కోరారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పాయకరావుపేట : ఈ నెల 25 నుండి 27 వరకు వివేకానంద రెసిడెన్షియల్ స్కూల్, కరీంనగర్ తెలంగాణాలో జరిగిన సీబీఎస్ఈ క్లసర్ - 7 కబడ్డీ పోటీల్లో అండర్ - 14, అండర్ - 19 విభాగాల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించి, ఒక్కో జట్టు రూ.10 వేలు నగదు బహుమతిని పొందడమే కాకుండా సెప్టెంబరు 13 నుండి 16 వరకు నారాయణ వరల్డ్ స్కూల్, జముహార్, బీహార్‌లో జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధించారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా సీబీఎస్ఈ క్లస్టర్ -7 కబడ్డీ పోటీల్లో అండర్ -19 విభాగంలో శ్రీ ప్రకాష్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించి ప్రథమ స్థానంలో నిలుస్తున్నారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు, సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఎం.అపర్ణ, కోచ్ లక్ష్మణ్, చినరాజు అభినందించారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పతకాల పంట



పతకాలు సాధించిన విజేతలు,



బంగారు పతకం సాధించిన చోడవరానికి చెందిన లాస్య

చోడవరం : జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. ఈనెల 25 నుంచి 28 వ తేదీ వరకూ విజయవాడలో 10వ ఓపెన్ జాతీయ స్థాయి తైక్వాండో క్యోరుగి, పూమ్‌సే పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 12 మంది క్రీడాకారులు బంగారు పతకాలు, ఆరుగురు రజత పతకాలు, 13మంది కాంస్య పతకాలు సాధించారు. చోడవరం, ఆరిలోవ ప్రాంతాలకు చెందిన చుక్కల లాస్య, ఎం.రవిచంద్ర, కొల్లిపార తన్విత్ ఉదయ్, గండి కారుణ్య సందీప్, ఎ.ధనుష్, బి.రాఘవ, డి.దక్షితరెడ్డి, డి.రుద్రాక్షరెడ్డి బంగారు పతకాలు సాధించారు. వీరిలో కొల్లిపార తన్విత్ ఉదయ్ 3, గండి కారుణ్యసందీప్ 2 బంగారు పతకాలు వివిధ విభాగాల్లో సాధించారు. ఎం.శరణ్య, జి.వి.శివవర్ధన్ కుమార్, ఎస్. రిషితాంజలి, బి.పర్ణిక ఆరోహి, ఎస్. కేశవర్ధన్, వి.ఇషితశారద, షేక్ సభీన ఆజ్మి, జి. భరద్వాజ్, బి.కార్తీక్, జి. జాహ్నవి జయశ్రీ రజతం, కాంస్య పతకాలు సాధించినట్టు ఏపీ తైక్వాండో అసోసియేషన్ విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు, కోచ్ పల్లం మురళి తెలిపారు. పతకాలు సాధించిన విజేతకు అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక

- జిల్లా స్థాయిలో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు



రాష్ట్రస్థాయి యోగా పోటీలకు చోడవరం క్రీడాకారుల ఎంపిక

చోడవరం :

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు చోడవరం క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల పరవాడ మండలంలో జరిగిన జిల్లా స్థాయి యోగాసనాల పోటీల్లో చోడవరానికి చెందిన ఒమ్మి శ్యామ్‌ప్రసాద్ యాదవ్, గొంతిన లయవర్ధన్, పందిరి వెన్నెశ్రీ, మళ్ల శ్రీహిత, పుల్లేటి సతీష్ బంగారు పతకాలు సాధించారు.

వీరు ఆగస్టు నెలలో కాకినాడలో జరగనున్న రాష్ట్రస్థాయి యోగాసనాల పోటీల్లో అనకాపల్లి జిల్లా నుంచి పాల్గొనేందుకు ఎంపికైనట్టు యోగా గురువు పుల్లేటి సతీష్ చెప్పారు. పతకాలు సాధించిన క్రీడాకారులను చోడవరం పతంజలి యోగా కేంద్రం ప్రతినిధులు అభినందించారు.

టీడీఆర్ బాండ్లు వద్దే వద్దు



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతులు

- నగదు రూపంలోనే పరిహారం అందించాలి
- అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు నిర్వాసితుల డిమాండ్
- అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా

అనకాపల్లి టౌన్: అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు నిర్వాసితులకు ఇళ్లు, దుకాణాలు, భూములకు ఒకేసారి నష్టపరిహారం చెల్లించాలని, ఆ నష్టపరిహారం టీడీఆర్ బాండ్ల రూపంలో కాకుండా నగదు రూపంలోనే అందించాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని మునగపాక నుంచి పాదయాత్ర ద్వారా అనకాపల్లి ఆర్డీవో కార్యాలయానికి సోమవారం చేరుకొని కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రోడ్డు విస్తరణ నిర్వాసితుల సంఘం కన్వీనర్ ఆర్.రాము మాట్లాడుతూ గతంలో నిర్వహించిన గ్రామ సభల్లో టీడీఆర్ బాండ్లు వద్దని నిర్వాసితులంతా ముక్తకంఠంతో వ్యతిరేకించారని తెలిపారు. అయినా నేడు నిర్వాసితులకు టీడీఆర్ బాండ్లే ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ భూములు కోల్పోతున్నవారందరూ పేదవారని, వారికి టీడీఆర్ బాండ్లు ఏమాత్రం ఉపయోగపడవన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పునరావాసం కల్పించాలన్నారు. అలాగే ఉపాధి కోల్పోయిన చిరు వ్యాపారులకు పరిహారం ఇవ్వడంతోపాటు ప్రభుత్వమే ఉపాధి కల్పించాలన్నారు. 100 అడుగుల తర్వాత నిర్మించుకొనే ఇళ్లకు ఎటువంటి నిబంధనలు పెట్టరాదన్నారు. రైతులను ఉద్దేశించి ఆర్డీవో షేక్ ఆయిషా మాట్లాడుతూ రైతుల భూముల విలువలో తేడాలుంటే కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని, వాటిని సరిచేస్తామన్నారు. టీడీఆర్‌లపై రైతులు అపోహలు విడనాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కో-కన్వీనర్ కె.రామసదాశివరావు పాల్గొన్నారు.

స్పీకర్ జోక్యం చేసుకోవాలని డప్పులతో నిరసన

- క్వారీ అనుమతులు రద్దు చేయాలని నిరసనకారుల డిమాండ్



డప్పులతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, బాధిత రైతులు, ప్రజా సంఘాల నాయకులు

నర్సీపట్నం: మాకవరపాలెం మండలం జి.కోడూరు నల్లరాయి క్వారీ అనుమతులు రద్దు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయంలో స్పీకర్ జోక్యం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ క్వారీ బాధితులు చేపట్టిన దీక్షలకు సోమవారం సీపీఎం నాయకులు మద్దతు పలికారు. వినూత్న రీతిలో వంటా వార్పుతోపాటు డప్పులు వాయిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ దళితుల భూముల్లో క్వారీని వెంటనే రద్దు చేయాలన్నారు. బాధితులు వారం రోజులుగా నిరాహారదీక్షలు చేస్తున్నా, ఆర్డీవో కానీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవటం దారుణమన్నారు. స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు నియోజకవర్గాన్ని గాలికి వదిలేశారన్నారు. నియోజకవర్గం మైనింగ్ మాఫియా చేతుల్లో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఎస్పీ రాష్ట్ర కమిటీ మెంబరు బొట్టా నాగరాజు మాట్లాడుతూ దళితుల ప్రాణాలు, భూములకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత స్పీకర్‌పై ఉందన్నారు. సమస్యను పట్టించుకోకపోతే బీఎస్పీ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీలు, ప్రజా సంఘాలను కలుపుకుని బాధితులకు అండగా నిలిచి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొంతు రమణ, సీపీఎం నాయకులు చిరంజీవి, బహుజన్ నాయకులు మట్ల చంటిబాబు, బాధిత రైతులు అప్పారావు, పెంటయ్య, గణేష్, సత్తిబాబు, సతీష్, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

లారీ లోడ్ స్క్రాప్ ఇస్తానని మోసం

అనకాపల్లి టౌన్: తక్కువ ధరకే ఎక్కువ ఇనుప సామగ్రి ఇస్తానని మోసగించిన గుర్తుతెలియని వ్యక్తిపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ విజయ్‌కుమార్ వివరాల ప్రకారం.. పూడిమడక రోడ్డులో కర్రి నాగేశ్వర్ కొద్ది సంవత్సరాలుగా స్క్రాప్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇతనికి లారీ లోడ్‌తో స్క్రాప్ తక్కువ ధరకే ఇస్తానని గుర్తు తెలియని ఒక వ్యక్తి నమ్మబలికాడు. అది నిజమని నమ్మి ఏప్రిల్ 8న రూ.2.50 లక్షలు సదరు వ్యక్తికి ట్రాన్స్‌ఫర్ చేశాడు. అప్పటి నుంచి ఫోన్ ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా, అదే నెల 9న నిందితుడు బ్యాంక్ ఖాతా హోల్డ్‌లో పెట్టారు. అప్పటికి ఆ అకౌంట్‌లో 2,19,640 రూపాయలు ఉన్నాయి. ఈ మేరకు డబ్బులు ఇప్పించాలని సోమవారం బాధితుడు ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు.

కోడి పందాలపై దాడి

- ఐదుగురు అరెస్టు

నాతవరం : గుట్టు చప్పుడు కాకుండా కోడి పందాలు ఆడుతుండగా సిబ్బందితో దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ సిహెచ్.భీమరాజు తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఎం.బి.పట్నం గ్రామ శివారులో గుట్టుచప్పుడు కాకుండా కోడి పందాలు ఆడుతుండగా ముందస్తు సమాచారంతో దాడి చేయడంతో ఐదుగురు పట్టుబడ్డారని తెలిపారు. మిగతా వారు తప్పించుకోని పారిపోయారన్నారు. పట్టుబడిన వారి నుంచి రెండు కోడిపుంజులు, రూ.360 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అయిదుగురిపై కేసు నమోదు చేశామన్నారు. కోడి పందాలు నిర్వహించే ప్రదేశం కోటవురట్ల మండలం కాకినాడ జిల్లా కోటనందూరు మండలం సరిహద్దు ప్రాంతం కావడంతో మిగిలిన నిందితులు తప్పించుకున్నారన్నారు.

ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కౌన్సెలింగ్ నేడు

కశింకోట: స్థానిక ఆర్ఈసీఎస్ కార్యాలయంలోని రాజీవ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యుత్ వినియోగదారుల పిల్లల 50 శాతం కోటా కింద సీట్ల భర్తీకి మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బి.ఉమాశంకర్ సోమవారం తెలిపారు. ఆర్ఈసీఎస్ ఎండీ జి. ప్రసాద్ ఆదేశాల మేరకు పాలిసెట్‌లో ఈ ఏడాది ర్యాంకు పొందిన ఆసక్తి కలిగిన విద్యార్థులు ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. రూ.లక్షలోపు తల్లిదండ్రుల వార్షిక ఆదాయం కలిగిన ఓసీ, బీసీ విద్యార్థులు, రూ.రెండే లక్షల లోపు వార్షిక ఆదాయం కలిగిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రభుత్వ నిబంధల ప్రకారం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకం వర్తిస్తాయన్నారు. విద్యార్థులు ఆదాయ ధ్రువపత్రం, తెల్ల రేషన్ కార్డు వెంట తీసుకుని రావాలన్నారు. పాలిసెట్ ర్యాంకు లేని విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తించదని, వార్షిక ఫీజులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అనకాపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఐవీఎస్ఎస్ శ్రీనివాసరావును కౌన్సెలింగ్ అధికారిగా నియమించారన్నారు.

గంజాయి వ్యాపారులపై పోలీసుల దాడి

- కేసు నమోదు, ముగ్గురు అరెస్ట్
- 60 కిలోల గంజాయి స్వాధీనం, ఒక ఆటో రెండు మొబైల్ ఫోన్లు సీజ్



గంజాయితో పట్టుబడ్డ నిందితులతో పోలీసులు

రోలుగుంట : మండలంలో గంజాయి వ్యాపారం చేస్తున్న రూట్లలో స్థానిక ఎస్ఐ రామకృష్ణారావు సిబ్బందితో కలసి కొత్తకోట సీఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో దాడి చేశారు. ఈ దాడిలో గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. గంజాయి తరలించడానికి వినియోగించిన ఆటోను సీజ్ చేశారు. మూడు బస్తాల్లో ఉన్న 60 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వివరాలివి. నిందితులు అల్లూరి జిల్లా చింతపల్లి మండలం మడిమబంద గ్రామానికి చెందిన వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేసి రత్నంపేటలో జీడితోటలో దాచారు. అక్కడ నుంచి ఆదివారం ఆటోలో గంజాయిని ఇతర ప్రాంతాలకు తరలిస్తూ పోలీసు దాడుల్లో పట్టుబడ్డారు. ఆటోలో ఉన్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆటోని సోదా చేసి మూడు బస్తాల్లో గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో రోలుగుంట మండలం రత్నంపేట గ్రామానికి చెందిన ఊడి రమణబాబు(25) (ఇతనిపై పాత కేసు ఉంది), ఆర్లి శ్రీను(29) (ఇతనిపై నాలుగు గంజాయి కేసులు ఉన్నాయి), అల్లూరి జిల్లా చింతపల్లి మండలానికి చెంది మడిమబంద గ్రామానికి చెందిన కొర్రా సూరిబాబు(53) ఉన్నారు. నిందితులను అరెస్టు చేసి సోమవారం రిమాండుకు తరలించినట్టు ఎస్ఐ విలేకరులకు తెలిపారు.

ఆరోగ్యం కోసం నిత్య వ్యాయామం

- అంతర్జాతీయ బాడీ బిల్డర్, టీమ్ ఇండియా కోచ్ శివశంకర్

అనకాపల్లి:

యువత చెడుమార్గాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యంగా కోసం నిత్యం వ్యాయామం చేయాలని అంతర్జాతీయ బాడీ బిల్డర్, టీమ్ ఇండియా కోచ్ టి.శివశంకర్ తెలిపారు. స్థానిక రింగ్ రోడ్డు డాక్టర్ హిమశేఖర్ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్లో అనకాపల్లి బాడీ బిల్డర్స్ అండ్ ఫిట్‌నెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యువతకు బాడీ బిల్డింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ద్వారా ఆరోగ్యంగా జీవించడమే కాకుండా శరీర ఆకృతిని పెంచుకోవచ్చన్నారు. అసోసియేషన్ కార్యదర్శి శిలపరశెట్టి బాబీ మాట్లాడుతూ యువత మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యంపై శ్రద్ధ చూపిస్తూ జిమ్‌కు వెళ్లాలన్నారు. బాడీ బిల్డింగ్ క్రీడ వల్ల మనం ఫిట్‌గా ఉండటమే కాకుండా సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఒలింపిక్ వెయిట్ లిఫ్టర్ మళ్ల వెంకట మాణిక్యాలు మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేస్తే విద్యతోపాటు క్రీడల్లోనూ ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరపల్లి కృష్ణాజీ, విశాఖ జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజారావు, అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ దండా కుసుమలు మాట్లాడుతూ క్రీడలతో ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. అనంతరం శివశంకర్‌ను అసోసియేషన్ సభ్యులు శాలువాతో సత్కరించారు.

కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీధర్, ఎన్‌సీసీ అధికారి ధర్మలింగం అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు శ్రీను, చిన్న, ప్రసాద్, నరేంద్ర, తులసి, విద్యార్థులు పాల్గొన్నారు.



టీమ్ ఇండియా కోచ్ శివశంకర్‌ను శాలువాతో సత్కరిస్తున్న అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యులు

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOTS FOR SALE

■ 5 లక్షలకే GVMC పరిధిలో 100 గ॥ 15 బిట్లు కలవు. అనకాపల్లిలో కొత్త లేఅవుట్‌కు పార్టనర్స్ కావలెను. ఫోన్ : 70936 32399, 73864 14017 [14188]

Wanted

■ స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 99590 21122, 99590 31122 [B-1275594]

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 20K. Ph: 8977639662, 8977639663 [SCA25006667]

Services

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 14035]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్

లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-16.

విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా + అల్లూరి జిల్లా : నాలుగు లైన్లు రూ. 475/- అదనపు లైను రూ. 100/- + 5% జి.ఎస్.టి. అదనం.

మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి:

అనకాపల్లి	:9010546644
యలమంచిలి	:9951602901
చోడవరం	:9010210265
నర్సీపట్నం	:9010234557
పాడేరు	:9010973030



క్లుప్తంగా

భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి



తహసీల్దార్ అప్పారావుకు వినతిపత్రం అందజేస్తున్న భవన నిర్మాణ సంఘం నేతలు

అనకాపల్లి టౌన్: జీవో నంబర్ 1217 రద్దు చేసి భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్షణ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ ఎం భాస్కర అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. లక్ష్మణ మాట్లాడుతూ 1996 చట్టం అమలు చేసి 12 రకాల సౌకర్యాలు అందించాలన్నారు. కార్మికులకు కొత్త గుర్తింపు కార్డులు ఇచ్చి, పాత కార్డులను రెన్యువల్ చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘాలతో వెంటనే మీటింగ్ ఏర్పాటు చేసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన కార్మికులకు పెన్షన్ మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘం నాయకులు ఎన్ రామారావు, బండారు వెంకటేష్, గంగిరెడ్ల సూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంక్షేమ సంఘ కార్యవర్గం ఎన్నిక



పద్మశాలి సంక్షేమ సంఘం నూతన కమిటీ ఇదే

అనకాపల్లి: పద్మశాలి సంక్షేమ సంఘం అనకాపల్లి అధ్యక్షుడిగా డాక్టర్ గెడ్డం ప్రభాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి వివేకానందనగర్ సాయితేజ ఆస్పత్రి ఆవరణలో సోమవారం జరిగిన ఎన్నికల్లో సంఘం గౌరవాధ్యక్షునిగా అముజూరి రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా తిప్పాన అప్పారావు, దొడ్డి సూరిబాబు, కన్వీనర్‌గా పంపాన సత్యనారాయణ, కార్యదర్శిగా సూరిశెట్టి రుషిబాబు, సహాయ కార్యదర్శులుగా కాకి శ్రీను, ఇమంది విజయ్ కుమార్, కోశాధికారిగా ఆకుల వెంకట అప్పారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా కాకి పైడిరాజు, జాయింట్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఆకుల రాజుబాబు ఎన్నికయ్యారు. నూతన కమిటీ రెండేళ్లపాటు పని చేస్తుందని అధ్యక్షుడు గెడ్డం ప్రభాకర్ చెప్పారు.

లైంగిక వేధింపుల దోషుల్ని శిక్షించాలి



సీఐ గణేష్‌కు వినతి పత్రం అందిస్తున్న ఐద్వా నాయకులు

పరవాడ: అచ్యుతాపురం శివారు కోనాంపాలెం దాబాలో ఇటీవల 13 ఏళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని అనకాపల్లి జిల్లా ఐద్వా అధ్యక్షురాలు పి.మాణిక్యం, జాయింట్ సెక్రటరీ ఆర్. లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు అచ్యుతాపురం సీఐ గణేష్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. అచ్యుతాపురం సెజ్, తదితర చిన్న చిన్న హోటళ్లలో పని చేస్తున్న మహిళలపై ఇలాంటి ఘటనలు జరిగితే, పోలీసులు వెంటనే స్పందించాలన్నారు. నిందితులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 86 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	----	----
రెండో రకం	3,650	3,680
మూడోరకం	3,100	3,500

అనకాపల్లి సినిమాలు

రాజా : ద ఫెంటాస్టిక్
సత్యనారాయణ స్క్రీన్-1:జూనియర్
సత్యనారాయణ స్క్రీన్-2 హరి హర వీరమల్లు
పర్తిసాయి : మహావతార్ నరసింహ
షిర్డీసాయి : హరి హర వీరమల్లు
వెంకటేశ్వర : హరి హర వీరమల్లు
శ్రీ సత్య :తమ్ముడు
రామచంద్ర : హరి హర వీరమల్లు

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 84 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-11, బీ పాజిటివ్-29, ఓ పాజిటివ్-40, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యాలోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

కూటమి వైఫల్యం

- ▲ టీడీఆర్ బాండ్లు ఇవ్వని ప్రభుత్వం
- ▲ ఆగిన పెరుగుబజార్ జంక్షన్ - గాంధీబొమ్మ రోడ్డు విస్తరణ
- ▲ రెండేళ్లు కావస్తున్నా పూర్తి కాని పనులు
- ▲ వర్షం వస్తే రోడ్డు మొత్తం చెరువే



గతుకులమయంగా మారిన కిరాణా షాపుల ప్రాంతం



వర్షం నీటితో చెరువుగా మారిన వెంకటేశ్వర థియేటర్ ప్రాంతం



చెత్తా చెదారాలతో నిండిన అసంపూర్తిగా నిర్మించిన కాలువ

అనకాపల్లి టౌన్: పట్టణంలో పెరుగుబజార్ జంక్షన్ నుంచి గాంధీబొమ్మ వరకు రోడ్డు అత్యంత కీలకమైనది. ఈ రోడ్డు విస్తరణ పూర్తి కాకపోవడానికి ముమ్మాటికీ కూటమి ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఈ రోడ్డు విస్తరణకు గత వైఎస్సార్‌సీపీ బాధితులను ఒప్పించి పనులు ప్రారంభించింది. అందులో భాగంగా కొంతమంది బాధితులకు టీడీఆర్ బాండ్లు ఇచ్చింది. ఇంతలో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో ఆ పనులు నిలిచిపోయాయి. కూటమి అధికారంలోకి ఏడాదిపైగా దాటినా మిగిలిన వారికి టీడీఆర్ బాండ్లు ఇవ్వడం లేదు. దాంతో రోడ్డు విస్తరణకు ఒప్పుకోవడం లేదు.

రోడ్డు విస్తరణ బాధితులకు టీడీఆర్ ఇవ్వని ప్రభుత్వం

పట్టణం నుంచి నూకాలమ్మ గుడి ప్రాంత వాసులు, దేవునిగుమ్మం, చింతావారి వీధి తదితర ప్రాంత ప్రజలు రైల్వే స్టేషన్‌కు వెళ్లాలంటే ఇదే ప్రధాన రహదారి. ఎప్పుడూ రద్దీగా ఉండే రహదారి గోతులమయంగా మారడం, వర్షం వస్తే అందులో నీరు నిలిచిపోవడం వల్ల వాహనదారుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఈ ప్రాంత వాసులు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకుండా పోయింది. ఇటీవల వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మలసాల భరత్‌కుమార్ పార్టీ క్యాడర్‌తో కలిసి రోడ్డును పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలు పడుతున్న ఇబ్బందులు తొలగించాలని అధికారులను కోరారు. 400 మీటర్లు మేర రహదారిలో 139 మంది తమ ఆస్తులను కోల్పోయారు. వీరికి జీవీఎంసీ ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్ టీడీఆర్ బాండ్‌లు ఇవ్వాల్సి ఉంది. 80 మందికి మాత్రమే టీడీఆర్‌లు ఇచ్చి మిగిలిన 56 మందికి ఇవ్వలేదు. అప్పటి నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా బాండ్లు ఇవ్వడం లేదని పలువురు వాపోతున్నారు. ఒక వేళ రోడ్డు వేయడానికి ఒప్పుకుంటే ఇక టీడీఆర్‌లు ఇవ్వరేమోనని పలువురు వ్యాపారులు ఆరోపిస్తున్నారు.

వ్యాపారాలు లేక వర్తకుల ఇబ్బందులు

పట్టణంలో ఈ రహదారి ఎంతో కీలకమైనది. బంగారు షాపులు, కిరాణా, ఫ్యాన్సీ, బట్టలు, ఫర్నిచర్, మెడికల్ హోల్‌సేల్ షాపులు ఉన్నాయి. ఈ షాపులకు నిత్యం పట్టణ వాసులే కాకుండా గ్రామీణ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వర్తకులు, వినియోగదారులు వస్తుంటారు. ఈ మార్గం ద్వారానే అనేక వీధులు కలుస్తాయి. కుమ్మర వీధి, జైన్ మందిరం, పప్పుల వీధి, చిన్న వీధులకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. కీలకమైన రహదారిని తక్షణమే బాగుచేసి వినియోగంలోకి తేవాలని పలు ప్రజా సంఘాలు, స్థానికులు ఆందోళనలు చేసినా ఫలితం లేకపోతోంది. అసంపూర్తి రోడ్డు వల్ల వ్యాపారాలు పూర్తిగా పడిపోయాయన్నారు. రోడ్డు బాగోలేకపోడం వల్ల ఎవరూ రావడం లేదని వాపోతున్నారు.

గొయ్యిలో పడి ప్రమాదాలు



అసంపూర్తి రోడ్డుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వర్షం వస్తే ఎక్కడ గొయ్యి ఉందో తెలియడం లేదు. వాటిలో పడి ప్రమాదాలు బారిన పడిన సంఘటనలు ఉన్నాయి. తక్షణమే రోడ్డు నిర్మించాలి.
- సేనాపతి సాయి, అనకాపల్లి

ఇబ్బందులు లేకుండా విస్తరణ పనులు



టీడీఆర్‌లు నిర్వాసితులకు అందజేసేందుకు కృషి చేస్తున్నాం. అందుబాటులోకి వచ్చిన వెంటనే అందజేస్తాం. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా విస్తరణ పనులు చేపడతాం.
- చక్రవర్తి, జోనల్ జోనల్ కమిషనర్, అనకాపల్లి

2023లో రోడ్డు విస్తరణ ప్రారంభం

పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పెరుగుబజార్ జంక్షన్ నుంచి గాంధీబొమ్మ వరకు రహదారి విస్తరణకు గత వైఎస్సార్ సీపీ హయాంలో అప్పటి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చొరవ తీసుకున్నారు. 2023 జూలై 10వ తేదీన ఈ పనులు ప్రారంభించారు. ఇందు కోసం రూ.11 కోట్లు విడుదల చేశారు. తదనతరం ప్రభుత్వం మారడంతో పనులకు బ్రేక్ పడింది. దీంతో ఆ రహదారిపై ప్రయాణించే ప్రయాణికులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పారిశుధ్య సిబ్బందిని కొనసాగించాలని డిమాండ్

అనకాపల్లి టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బందిని యధావిధిగా కొనసాగించాలని ఏపీ స్కూల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అనకాపల్లి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జానకి మాట్లాడుతూ 300 మంది విద్యార్థులు చదువుతున్న పాఠశాలలో ఒక్క విద్యార్థి తక్కువ ఉన్నా రెండో శానిటేషన్ సిబ్బందిని తొలగిస్తున్నారని వాపోయారు. ఈ చర్య చాలా అన్యాయమన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. వీరందరూ కడు పేదవారని తొలగించడం అన్యాయమన్నారు. వీరికి కేవలం ఆరు వేల రూపాయిలు మాత్రమే వేతనాలు ఇస్తున్నారన్నారు. తక్షణమే కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా 200 మంది విద్యార్థులు ఉన్న ప్రతీ పాఠశాలలో ఇద్దరు శానిటేషన్ సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గౌరీ, ఎస్.కె.బి.బి. లక్ష్మి, అమ్మాజీ, జి. వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ తారకేశ్వర్రావు

గొలుగొండ: సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులను నమ్మి పోసపోవద్దని కృష్ణదేవిపేట ఎస్ఐ తారకేశ్వర్రావు తెలిపారు. లింగంపేటలో ఆదివారం రాత్రి గ్రామస్తులకు ఆయన అవగాహన కల్పించారు. ఫోన్ వాట్సాప్‌లో అనేకరకాలుగా లింక్‌లు ఇచ్చి ప్రజలను సైబర్ నేరగాళ్లు మోసం చేయడం జరుగుతుందని, అందువల్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. యువత చదువుపై శ్రద్ధ వహించి చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి భవిష్యత్ ఎంచుకోవాలన్నారు.

వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థిని నోట్ పుస్తకాలు పరిశీలిస్తున్న డైట్ కళాశాల సీనియర్ అధ్యాపకురాలు సునీత



విద్యార్థినులకు పాఠాలు చెబుతున్న డైట్ సీనియర్ అధ్యాపకురాలు సునీత

కశింకోట: విద్యలో వెనుకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని భీమునిపట్నం డైట్ కళాశాల సీనియర్ అధ్యాపకురాలు బి. సునీత ఆదేశించారు. స్థానిక బాలికల హైస్కూలును సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆరు, పది తరగతుల విద్యార్థినుల చదువు తీరును, నోట్ పుస్తకాల దిద్దుబాటు సవరణలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 50 శాతం మంది వరకు విద్యార్థినులు పాఠ్యాంశాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. టెన్త్‌లో ప్రధానంగా బయాలజీ సబ్జెక్టులో ఎక్కువగా వెనుబడి ఉన్న వారి పట్ల ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. వారి చదువు తీరును మెరుగుపర్చి పరీక్షలకు సన్నద్ధం చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్నెల్ల తర్వాత మళ్లీ పాఠశాలను సందర్శించి పరిశీలిస్తానన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. రోజూ ఇలాగే ప్రభుత్వం నిర్దేశించిన మెనూను అనుసరించి రుచికరంగా విద్యార్థులను తమ పిల్లలుగా భావించి భోజనం అందించాలన్నారు. హెచ్‌ఎం ఎంఎస్ స్వర్ణకుమారి, ఇన్‌చార్జి హెచ్‌ఎం శశికళ, ఉపాధ్యాయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

త్రిపురాంతక స్వామికి పూజలు

కశింకోట: స్థానిక సర్వమంగళాంబ సమేత త్రిపురాంతక స్వామి ఆలయం (శివాలయం)లో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని పూజలు చేశారు. అర్చకులు వి. చిదంబరం, కృష్ణల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దాతల ఆర్థిక సహాయంతో పేదలకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

పంచాయతీ కార్యదర్శి రిలీవ్‌లో జాప్యం

కశింకోట: స్థానిక పంచాయతీ కార్యదర్శి ఎస్. రామచంద్రరావుకు బదిలీ అయినా రిలీవ్ చేయకపోవడంతో 50 రోజులుగా ఇక్కడే విధులు నిర్వహించాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. విశాఖ జిల్లా భీమునిపట్నం మండలం చిప్పాడ పంచాయతీ కార్యదర్శిగా గత నెలలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో బదిలీ అయ్యారు. ఏడు నెలల క్రితం ఇక్కడకు బదిలీపై వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. ఏ కారణం వల్ల అధికారులు రిలీవ్ చేయకపోవడంతో ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు. తన కుటుంబ సభ్యుల అనారోగ్య కారణాల దృష్ట్యా అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించడం కోసం కౌన్సెలింగ్‌లో విన్నవించుకున్న మేరకు బదిలీ అయిందని కార్యదర్శి రామచంద్రరావు తెలిపారు. తనతోపాటు బదిలీ అయిన ఇద్దరు కార్యదర్శులను రిలీవ్ చేశారని, తనను మాత్రం చేయడం లేదని వాపోతున్నారు. తనను రిలీవ్ చేయకుండా జాప్యం చేస్తుండటంపై హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. తమ కుటుంబ సభ్యుల అనారోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రిలీవ్ చేయడానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

నిల్వ నీటితో జ్వరాలు ప్రబలే అవకాశం

కె.కోటపాడు: వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో మురుగు నిల్వ లేకుండా ప్రజలు జాగ్రత్తలను పాటించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ తెలిపారు. వి.సంతపాలెంలో సోమవారం జాతీయ డెంగ్యూ మాసోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది, ప్రజలతో కలిసి ఆమె అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాత టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు, గోలాల్లో రోజుల కొలది నీరు నిల్వ ఉండడం వల్ల నీటిలో దోమలు వృద్ధి చెందుతాయని, దోమకాటు ద్వారా డెంగ్యూ ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల ఎప్పటికప్పుడు మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు.

సుజల స్రవంతి నిర్వాసితుల నిరసన



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నల్లరేగుడుపాలెం గ్రామం రైతులు

అనకాపల్లి టౌన్: సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని, బలవంతపు భూ సేకరణ చేయొద్దని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఆవరణలో సబ్బవరం మండలం నల్లరేగుడుపాలెం రెవెన్యూ గ్రామ రైతులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ వీరంతా 70 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూములు కోల్పోవడం వల్ల రోడ్డున పడే పరిస్థితి నెలకొందన్నారు. ఈ భూములకు బదులు వేరొక చోట భూములు ఇచ్చి ఆదుకోవాలన్నారు. ప్రస్తుత మార్కెట్ విలువకు నాలుగు రెట్లు నష్టపరిహారం అందివ్వాలన్నారు. కార్యక్రమంలో గంటా శ్రీరామ్, వి. నరేంద్ర కుమార్, పెతకంశెట్టి రమేష్, బుగుడి నూక అప్పారావు, గొలగాని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వరసిద్ధి వినాయక కల్యాణం



సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి కల్యాణం చేస్తున్న అర్చకులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతీ దేవాలయంలో సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి పంచలోహ ఉత్సవమూర్తుల ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం రాత్రి అర్చకులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. విగ్రహ దాత కొణతాల లక్ష్మీనారాయణ (పెదబాబు) జయలక్ష్మి దంపతులు కల్యాణంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, ఉపాధ్యక్షుడు ఆళ్ల మహాలక్ష్మినాయుడు, సహాయ కార్యదర్శి మళ్ల సూర్యప్రకాశరావు, ఆలయ ప్రధాన అర్చకుడు అంపోలు గోపాలకృష్ణశర్మ, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకలు ఎలా?

ఎన్టీఆర్ క్రీడా మైదానంలో వినాయక వేడుకలకు ఏర్పాట్లు



క్రీడా మైదానంలో 70 అడుగుల వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్మిస్తున్న పందిరి

అనకాపల్లి: నూతన జిల్లాగా ఏర్పడిన దగ్గర నుంచి అనకాపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ క్రీడా మైదానంలో పంద్రాగస్టు వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మాత్రం ఇక్కడ 70 అడుగుల వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కూటమి నేతలు ఇప్పటికే సరుగుడు కర్రలతో పందిరి నిర్మిస్తున్నారు. వచ్చే నెల ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం, 27న వినాయక చవితి వేడుకలు జరగనున్నాయి. జీవీఎంసీ నిబంధనలు ప్రకారం క్రీడా మైదానంలో ఎటువంటి విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇవ్వకూడదు. ఇక్కడ వినాయ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇచ్చారా లేదా తెలియాల్సి ఉంది. దీనిపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు 15న వివిధ ప్రభుత్వ శాఖ శకటాల ప్రదర్శన, స్టాళ్లు, అగ్నిమాపక శాఖ విన్యాసాలు, పోలీస్ పరేడ్ నిర్వహించేందుకు క్రీడా మైదానం సరిపోవడంలేదు. దాంతో రహదారి పక్కనే వాహనాల పార్కింగ్ చేయాల్సి వస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో క్రీడా మైదానంలో వినాయక విగ్రహాన్ని ఎలా ఏర్పాటు చేస్తారని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

డీసీఎంఎస్ స్థలాన్ని వినియోగించుకోవాలి....

క్రీడా మైదానానికి ఆనుకున్న డీసీఎంఎస్ స్థలాన్ని వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవాలని ఎన్టీఆర్ క్రీడా మైదానం వాకర్స్, క్రీడాకారులు కోరుతున్నారు. నిత్యం వేలాది మంది యువకులు, వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు క్రీడా మైదానంలో వాకింగ్, రన్నింగ్ చేస్తుంటారు. యువత క్రికెట్ ఆడుకుంటోంది. ఇప్పుడు వీరికి ఇబ్బందులు తప్పవని వాపోతున్నారు.

అసంపూర్తి రోడ్లు తక్షణం పూర్తి చేయాలి

పీజీఆర్ఎస్‌లో సీపీఎం నేత వెంకన్న వినతి



ఎంపీడీవో కార్యాలయం పీజీఆర్ఎస్‌లో వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నేత వెంకన్న

దేవరాపల్లి: మండలంలో అసంపూర్తిగా నిలిచి పోయిన రోడ్లను తక్షణమే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న డిమాండ్ చేశారు. దేవరాపల్లి ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్‌లో ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి డి.వి. లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు. వాలాబు, చింతలపూడి పంచాయతీ పరిధిలో రోడ్లు అసంపూర్తిగా నిలిచిపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వాలాబు పంచాయతీ శివారు గ్రామాల్లో రూ.12 కోట్లతో సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టారని, చింతలపూడి పంచాయతీ శివారు వీరభద్రపేటకు రూ. 84 నిధులు మంజూరు చేయగా ఎర్త్ వర్కు చేసి మిగిలిన పనులు నిలిపివేశారన్నారు. బోడిగరువు, నేరెళ్లపూడి రోడ్డు సైతం అసంపూర్తిగా నిలిచిపోయిందన్నారు. అధికారులు తక్షణమే స్పందించి అసంపూర్తి రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరారు.

ఉపాధ్యాయులపై అధికారుల ఒత్తిడి సహించం

- తక్షణమే 30 శాతం ఐఆర్ ప్రకటించాలి
- పీఆర్‌టీయు నాయకుల డిమాండ్

నర్సీపట్నం: జీవో పాపర్టీ(పి-4) కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థి కుటుంబాలను తప్పనిసరిగా దత్తత తీసుకోవాలంటూ విద్యాశాఖ అధికారులు నిర్బంధం చేయడం సరికాదని పీఆర్‌టీయు నర్సీపట్నం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వరహాలనాయుడు, జి.వి.రమేష్ పేర్కొన్నారు. పి-4 విధానంలో భాగంగా ప్రతి ప్రధానోపాధ్యాయుడు కనీసం ఐదు కుటుంబాలు, ఉపాధ్యాయులు రెండు కుటుంబాలను తప్పనిసరిగా దత్తత తీసుకుని ఆన్‌లైన్ రిజిస్టర్ చేయాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించడం వల్ల ఒత్తిడికి గురి కావాల్సి వస్తోందన్నారు. ఉపాధ్యాయులకు లింక్‌లు పంపి రెండు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలని పదే పదే ఒత్తిడి చేయడం, అత్యవసరంగా పూర్తి చేయాలంటూ ఉపాధ్యాయులకు నోటీసులు ఇవ్వడం వల్ల ఉపాధ్యాయులు ఒత్తిడికి లోనై అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఇప్పటి వరకూ ఒక్క డీఏ కూడా మంజూరు చేయలేదన్నారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించలేదన్నారు. వెంటనే పీఆర్సీ కమిషన్ చైర్మన్ నియమించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. ఇటీవల బదిలీలలో సర్దుబాటుకు గురై 2 నెలలుగా జీతాలు పొందలేకపోతున్న ఉపాధ్యాయుల సమస్యను పరిష్కరించాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించడం వల్ల విద్యావ్యవస్థ కుంటుపడుతుందన్నారు.

మత్తుకు బానిసలైతే జీవితాలు చిత్తు



గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న సీఐ రామచంద్రరావు

సబ్బవరం: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, రహదారుల భద్రతపై అవగాహన కలిగి ఉండాలని సబ్బవరం సీఐ వి.రామచంద్రరావు తెలిపారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో రహదారుల భద్రత, మత్తు పదార్థాల నిర్మూలనపై సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా క్రమ శిక్షణతో విద్యను అభ్యసిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కళాశాలలు, పాఠశాలల్లో మత్తు పదార్థాలను దరిచేరనీయకుండా జాగ్రత్తపడాలన్నారు. గంజాయి, మద్యం, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసలైతే కుటుంబాలు చిత్తవుతాయన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనకాపల్లి :
9010973030, 9010546644, 9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com